

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఆత్మహత్య చేసుకుని మరో ఇద్దరు.. 7

40 తులాల

బంగారు ఆభరణాలు చోరీ

ఇంటి తాళం పగులగొట్టి చొరబడిన దొంగలు 7



మెదక్ సీఎస్ఐలో పహల్గాం మృతులకు నివాళి

మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పక్క జిల్లాలు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థన మందిరం కిక్కిరిసింది. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన శిలువ వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం భక్తులు, సీఎస్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల ఉగ్రవాద దాడిలో మృతిచెందినవారికి నివాళులర్పించారు.

-మెదక్ కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

ఏడుపాయలలో భక్తుల సందడి



ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. -పాపన్నపేట (ఆంధ్రజ్యోతి)





మల్చింగ్‌తో

మస్తు దిగుబడి

- తక్కువ ఖర్చు.. అధిక లాభాలు
- చీడపీడల బాధ లేదు.. కలుపు సమస్యకు చెక్ 7
- 50 శాతం సబ్సిడీపై షీట్స్



అంగన్‌వాడీ కేంద్రం

పూర్తయ్యేదెన్నడో?

- అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణ పనులు
- వినియోగంలోకి తేవాలని స్థానికుల డిమాండ్ 8

నకిలీ విపత్తు

పల్లెల్లో పత్తి విత్తన కంపెనీల ప్రచారం





వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే పత్తి విత్తన కంపెనీలు ప్రచారం మొదలుపెట్టాయి. ప్రచార రథాలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో రైతులను మభ్యపెడుతున్నాయి. ఉద్దెర పేరిట ఊదర గొడుగున్నాయి. రైతులను తికమక పెడుతున్నాయి.

ప్రచార రథాలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్ల పంపిణీ

రైతులను మభ్యపెట్టేందుకు వ్యూహం

వానాకాలం రాకముందే రంగంలోకి

గ్రామాలవారీగా ఏజెంట్ల నియామకం

ఉద్దెర ఇస్తామని ఆశ చూపే ప్రయత్నం..

రెట్టింపు ధరకు విక్రయం

నమ్మితే నట్టేట మునిగినట్టే!

మునిపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : విత్తన కంపెనీలో గ్రామాలవారీగా ఏజెంట్లను నియమించుకుని రైతులను బుట్టలోవేసుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి. గ్రామాల్లో ప్రచార రథాలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్ల పంపిణీ ద్వారా ప్రచారం ప్రారంభించాయి. దీనికితోడు ఏజెంట్లు తమ కంపెనీ విత్తనాలు బాగుంటాయని, అధిక దిగుబడులు వస్తాయని ఊదరగొడుతున్నారు. గతంలో తమ కంపెనీ విత్తనాలు అధిక దిగుబడులు ఇచ్చాయంటూ రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రచార హోరులో పడి పంటల వేసే సమయంలో ఏదో ఒక విత్తనం వేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యమో.. లేక విత్తనాల సమస్యనో.. ఈ ఏడాది మాత్రం రైతులకు ఖర్చులు అధికమై దిగుబడులు రాక తీవ్రనష్టం వాటిల్లింది. ఎకరాకు ఆరు క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేలురకం పత్తి విత్తనాలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని ఆశతో నాటినప్పటికీ ఆశించిన దిగుబడులు రాలేదు.

ఉద్దెర పేరిట దందా

ఉద్దెర పేరిట ఏజెంట్లు రైతులను దోచుకుంటున్నారు. నాణ్యమైన బీటీ విత్తనాల 450 గ్రాముల ప్యాకెట్ ఎమ్మార్పీ రూ.864 ఉంటే.. ఉద్దెర రూ.1,100 విక్రయిస్తున్నారు. ఈ ఏడాది మరింత పెంచనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతేడాది రెండు కంపెనీలు తమ విత్తనాలు నాటితే అధిక దిగుబడులు వస్తాయని ప్రచారంతో ఊదరగొట్టాయి. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అంటూనే బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించాయి. ఎమ్మార్పీ రూ.864 ఉంటే బ్లాక్ మార్కెట్‌లో రూ.1,400 నుంచి రూ.2వేల వరకు విక్రయించాయి. ఈ విషయాన్ని రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఓ ఫర్టిలైజర్ షాపు డీలర్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రైతులు ఆ రెండు కంపెనీల విత్తనాలే కావాలని అడగడంతో డిమాండ్ పెరిగి డిస్ట్రిబ్యూటర్లు ఎమ్మార్పీ రేటు కంటే అధిక ధరలకు తమకు విక్రయించారని, అందుకే తాము కూడా కొంత లాభాన్ని చూసుకొని విక్రయిస్తున్నామని డీలర్లు చెబుతున్నారు. ఈసారైనా పత్తి విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి క్యాన్సర్ సర్వే

త్వరలోనే బాధితులకు సర్కారు భరోసా!



సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్సలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. బాధితుల గుర్తింపునకు నేటి నుంచి సర్వేకు ఆదేశించింది. మే 3వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని సూచించింది. ప్రతీ ఇంటికి వెళ్లి క్యాన్సర్ పేషెంట్లు ఉన్నారా, ఉంటే ఎక్కడ ట్రీట్‌మెంట్ పొందుతున్నారు, క్యాన్సర్ ఏ స్టేజీలో ఉంది, పాలియేటివ్ హోమ్ కేర్ సర్వీసెస్ అవసరమున్నాయా? తదితర విషయాలను అడిగి నమోదు చేస్తారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 73 మంది నోటి క్యాన్సర్, 61 మంది బ్రెస్ట్ క్యాన్సర్, 64 మంది సర్వైకల్ క్యాన్సర్, 147 మంది ఇతరత్ర క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నారు. వీరితో పాటు 345 మందికి పాలియేటివ్ కేర్ సర్వీసెస్ పొందుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

బాధితులకు సర్కారు భరోసా

క్యాన్సర్ స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్‌పై సర్కారు దృష్టిసారించిన నేపథ్యంలో బాధితులకు ఇక జిల్లాల్లోనే చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. తొలి విడతలో బాధితుల గుర్తింపు సర్వే పూర్తికాగానే తీవ్రతను బట్టి ఏమేరకు చర్యలు తీసుకోవాలన్న దానిపై మార్గదర్శకాలు జారీ చేయనున్నది. ఇప్పటికే రూ.50 కోట్లతో సంగారెడ్డిలో ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. దీంతో పాటు జిల్లాకో మొబైల్ స్క్రీనింగ్ వాహనం మంజూరు చేయాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఈ వాహనం ప్రతీ గ్రామాన్ని సందర్శించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుంది. 18 ఏళ్లు నిండిన వారందరికీ పరీక్షలు చేస్తారు. ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలు బయటపడితే జిల్లా కేంద్రంలోని క్యాన్సర్ చికిత్స కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తారు. తీవ్రత ఎక్కువగా ఉంటే హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి సిఫారసు చేస్తారు.

పంచాయతీ కార్యదర్శులు పరేషాన్

- నిధులు లేక నిలిచిన పనులు
- రోజువారీ నిర్వహణ కోసం అప్పులు
- ఎన్నాళ్లు ఇలా అంటూ ఆవేదన



తండాలో మిషన్‌భగీరథ రాక వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు



నర్సాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గాలు లేక.. ప్రభుత్వం నుంచి నిధులు రాక పంచాయతీల్లో పాలన కుంటుపడుతున్నది. భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతున్నది. పన్నులతో వచ్చే ఆదాయం సరిపోక గ్రామాల్లో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నర్సాపూర్ డివిజన్‌లో 160 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల ఆధ్వర్యంలో వీధి లైట్ల నిర్వాహణ, మురికికాల్వలు, వీధుల శుభ్రం, నీటి సరఫరా కోసం ఉన్న బోర్ల ఎప్పటికప్పుడు బాగు చేయడం ప్రధాన విధి. వీటితో పాటు పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి. ట్రాక్టర్ల నిర్వాహణ చూడాలి. పంచాయతీల అభివృద్ధి కోసం నిధులు ఎప్పటికప్పుడు మంజూరవుతుంటాయి పన్నుల రూపంలో వసూలు చేసే నిధులను కూడా గ్రామంలో సమస్యల పరిష్కారానికి వినియోగిస్తారు. అయితే, రెండేళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. కనీసం గ్రామంలో పన్నుల రూపంలో వసూలు చేసిన వాటితో నైనా చిన్నచిన్న పనులైన చేద్దామంటే వాటిని కూడా ట్రెజరీలో జమ చేసినా వాడుకోకుండా ప్రభుత్వం నియంత్రించడంతో వాటిని కూడా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. పాలకవర్గాలు లేకపోవడంతో కార్యదర్శులే అన్ని తామై నిర్వహిస్తున్నారు. నిధులు లేక చిన్నచిన్న పనులు కూడా చేయలేక ప్రజలచే చివాట్లు తినాల్సి వస్తున్నదని వాపోతున్నారు. సొంత డబ్బులు ఖర్చు చేసి, అప్పులు చేసి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని చెబుతున్నారు. పాలకవర్గం లేకపోవడంతో ప్రజలు ఏ చిన్న సమస్య వచ్చినా కార్యదర్శులపైనే ఒత్తిడి చేస్తుండటంతో ఏమి చేయాలో తోచని పరిస్థితులో దిక్కుతోచని పరిస్థితులో కొట్టుమిట్లాడుతున్నారు. కొందరైతే ఒత్తిడి తట్టుకోలేక ఉద్యోగమే మానేద్దామనే ఆలోచన వస్తున్నట్లు వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కత్తిమీద సామే!

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కార్యదర్శులకు ఇది కత్తిమీద సాములా మారింది. పాలకవర్గం లేకపోవడంతో ఆ భారం వారిపైనే పడింది. వేలలో దరఖాస్తులు వస్తే గ్రామానికి పదుల సంఖ్యలో ఇళ్లు రావడంతో లబ్ధిదారుల ఎంపిక తలనొప్పిగా మారింది. ఇందిరమ్మ కమిటీలు వేసినా కమిటీలో ఏకాభిప్రాయానికి రాకుండా తాము చెప్పిన వారికే ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు ప్రధాన పార్టీల నాయకులు కూడా ఒత్తిడి తెస్తుండటంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్

'భెల్' ఫ్లైఓవర్ ప్రారంభానికి ముహూర్తం

- 5న ప్రారంభించనున్న కేంద్ర మంత్రి గడ్కరీ
- 1.6 కిలోమీటర్లు.. రూ.172 కోట్లు వ్యయం
- రెండేళ్లలో పూర్తయిన నిర్మాణ పనులు

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా బీహెచ్‌ఈఎల్ కూడలిలో జాతీయ రహదారిపై నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభానికి ముహూర్తం కుదిరింది. వచ్చే నెల 5న కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ప్రారంభించనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర రీజినల్ చీఫ్ ఇంజనీర్ కృష్ణప్రసాద్ ఆదివారం ఫ్లైఓవర్‌ను పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. చందానగర్ నుంచి రామచంద్రాపురం అశోక్‌నగర్ వరకు 1.6 కిలోమీటర్ల మేర రూ.172 కోట్లతో ఆరు వరుసల వంతెన నిర్మాణం చేపట్టారు. హైవే కావడంతో జాతీయ స్థాయి నిబంధనల ప్రకారం వంతెన నిర్మించారు. మూడు వరుసల చొప్పున రెండు వైపులా ఒకేసారి మూడేసి వాహనాలు వేగంగా ప్రయాణించినా ఇబ్బందుల్లేకుండా నిర్మించారు. లైటింగ్, బోర్డులు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా జరిగిన ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. లింగంపల్లి చౌరస్తాను ఆధునీకరిస్తున్నారు. రెండు యూటర్న్‌లు చేసేందుకు అవకాశం కల్పించారు.



బస్సును అడ్డుకుంటున్న గ్రామస్థులు

బీఆర్ఎస్ సభకు వెళ్తున్న బస్సులను అడ్డుకున్న నల్లవల్లి గ్రామస్థులు

గుమ్మడిదల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో బీఆర్ఎస్ సభకు వెళ్తున్న బస్సులను సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామ ప్రజలు ఆదివారం అడ్డుకున్నారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా 81వ రోజు జేఏసీ ఆధ్వర్యంలో గ్రామస్థులు నిరసన రిలేనిహారదీక్ష కొనసాగించారు. పోరాటాన్ని పట్టించుకోకుండా గ్రామ బీఆర్ఎస్ నాయకులు సభకు తరలివెళ్లడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకన్నా ప్రాణాలు ముఖ్యమని, భవిష్యత్తును కాపాడండి అంటూ నినాదాలు చేశారు. డంపుయార్డ్‌ను నిలిపివేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ సభకు మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు.. నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్ నుంచి తరలివెళ్తున్న కార్యకర్తల బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు బయలుదేరారు. ఆయా మండలాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, పార్టీ జెండాను ఎగురవేసి బస్సులను ప్రారంభించారు.

-మరిన్ని ఫొటోలు 8లో..



శివ్వంపేటలో సునీతారెడ్డి..



పోరాటాలు కొనసాగిస్తాం

● ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి


జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దళితులపై కొనసాగుతున్న వివక్షపై పోరాటాలు కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద నిరసన తెలిపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని మెదక్ మున్సిపల్ కార్యాలయ అధికారులు ఒప్పందం ప్రకారం పునఃప్రతిష్ఠించాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం పట్ల నిర్లక్ష్య వైఖరి తగదని, బాధ్యత గల పనితీరు ఏ మాత్రం కనపడడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అస్తరగల్ల బాలరాజ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్ముశేకులు, ఎమ్మార్పీఎస్ పట్టణ కార్యదర్శి ప్రభాకర్ ప్రవీణ్, సంపత్ కుమార్, అక్క మూల కుమార్, సిద్ధ రాములు, జిల్లా నాయకులు శ్రీనివాస్, రత్నయ్య, గోపాల్, గట్టయ్య పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసంపై సమగ్ర విచారణ చేయండి

జిన్నారం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో శివుడి విగ్రహం ధ్వంసమైన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 22న శివాలయం గుట్ట వద్ద ఉన్న శివుడి మట్టి విగ్రహం ముక్కలైన ఘటనలో స్థానికంగా ఉన్న ఓ మత విద్యాసంస్థ విద్యార్థుల పాత్రపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, ఘటనా స్థలానికి ఆ విద్యార్థులు ఎందుకు వచ్చారో తేల్చాలని కోరుతూ జిన్నారం, జంగంపేట, ఊట్ల గ్రామాలకు చెందిన పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల అల్లర్ల నేపథ్యంలో జిన్నారంలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఇందిరమ్మ మోడల్ హౌజ్ రెడీ

● నిబంధనలు సడలించాలని లబ్ధిదారుల వేడుకోలు



హుస్నాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మోడల్‌హౌజ్ పూర్తయింది. హుస్నాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ. 5 లక్షల వ్యయంతో దీనిని నిర్మించారు. కిచెన్, హాల్, ఒక బెడ్ రూమ్, రెండు బాత్‌రూమ్‌లను నిర్మించారు. లబ్ధిదారులు ఈ మోడల్‌లోనే నిర్మించుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే లబ్ధిదారులు మాత్రం ఇందులోని నిబంధనలను సడలించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ ఇంటికి ఇచ్చే నిధులతో పాటు అదనంగా మరికొంత డబ్బు కలిపి పెద్దగా నిర్మించుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందిరమ్మ మోడల్ హౌజ్ చిన్నగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల స్థోమత తీరుగా నిర్మించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందండి

నారాయణఖేడ్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈనెల 30లోపు 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను అడ్వాన్స్ చెల్లించి, ఐదుశాతం రాయితీ సౌకర్యాన్ని పొందాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతేడాది కూడా పట్టణ ప్రజలు సహకరించడం వల్ల నారాయణఖేడ్ ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైందని, అందువల్ల ఈనెల 30లోపు అడ్వాన్స్ పన్ను చెల్లించి రాయితీ సౌకర్యాన్ని చెల్లించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


రాయపోల్‌లో నిర్మించిన మార్కండేయ స్వామి ఆలయం

రాయపోల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో నేటి నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, దేవతాహ్వానం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలు ఉంటాయి. మంగళవారం ప్రత్యేక పూజలు, హవన కార్యక్రమాలుంటాయి. చివరి రోజైన బుధవారం పూజల అనంతరం యంత్ర ప్రతిష్ఠ శ్రీ భక్త మార్కండేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పద్మశాలీ సంఘం సభ్యులు తెలిపారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మేడేను జయప్రదం చేయాలి

● సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మే 1న దీక్ష దినం, మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. రాణే బ్రేక్ లైనింగ్స్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశాన్ని ఆదివారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎల్లయ్య నాయకులతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 1న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్టు తెలిపారు. బీఎంఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఫెడరేషన్లు సమ్మెలో పాల్గొంటున్నాయని తెలిపారు. మోసపూరిత ప్రకటనలు చేసే బీఎంఎస్‌ను 4వ సారి ఆర్‌బీఎల్ పరిశ్రమ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓడించి, సీఐటీయూను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బీఎల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు భిక్షపతి, ఉప ప్రధాన కార్యదర్శి బండ్లస్వామి, రంగారెడ్డి, మల్లయ్య, నర్సింలు, రాజగోపాల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.





శ్రీనివాస్ సేవలు అభినందనీయం

● మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్


ఎస్ఐగా ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ, సీఐ, ఎస్ఐ ఇతర సిబ్బంది

నర్సాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ దాకా శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయమని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో నర్సాపూర్ ఎస్ఐ-2గా ఉద్యోగ విమరణ పొందిన శ్రీనివాస్ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన హాజరై శ్రీనివాస్ దంపతులను సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి కత్తి మీద సాములాంటిందని, అటువంటి వృత్తిలో కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు ఎదిగి ప్రజల చేత అభిమానం చూరగొన్న వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అందోల్ కృష్ణ



బద్రిగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అందోల్ కృష్ణ

పుల్‌కల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అందోల్ కృష్ణ అన్నారు. చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామంలో ఆదివారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చింత అంజనేయులుముదిరాజ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు మహేశ్‌గౌడ్, వినయ్, డ్వాక్రా మహిళ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వడ్డే నాగన్న మృతదేహం

జహీరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లిలో వడ్డే నాగన్న(50) రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. దుస్తులు వేసుకునేందుకు వీలుగా తాడుతో దండెం కట్టుకున్నారు. ఆ పక్కనే మీటరు వద్ద ఉన్న బైండింగ్ వైరుకు విద్యుత్ సరఫరా అవుతుంది. గమనించని నాగన్న దండెంతో బైండింగ్‌వైరును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య తుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారన్నారు.





మల్చింగ్‌తో మస్తు దిగుబడి

● తక్కువ ఖర్చు.. అధిక లాభాలు
● చీడపీడలు, కలుపు సమస్యకు చెక్
● 50 శాతం సబ్సిడీపై షీట్స్ అందజేత



కంది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఒకటైన ప్లాస్టిక్ మల్చింగ్ విధానంతో తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులు సాధించవచ్చు. దీని ద్వారా నేలలోని తేమను కాపాడుకోవడంపాటు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. ఈ విధానం రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా నివారించడం వల్ల వివిధ కాలపరిమితులు గల పంటలకు 30-40శాతం వరకు నీటి ఆదా అవుతుంది. ఇంకా దీనిని బిందు సేద్యం పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20శాతం నీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు.మొక్కలకు వాటి జీవితకాలమంతా అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఏర్పడి ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో (20-50శాతం) అధిక దిగుబడులు పొందవచ్చు. భూమిలో ఎల్లప్పుడూ తేమ నిల్వ ఉండడం వల్ల నేల గుల్లబారి వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి కూడా మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది.

పంటను బట్టి షీట్ల ఎంపిక

ఉద్యాన పంటలైన కూరగాయలు పండ్లు, పూల మొక్కల సాగులో మల్చింగ్ షీట్లను ఉపయోగిస్తారు. 3 నుంచి 4నెలల కాలవ్యవధి ఉండే పంటల సాగులో (కూరగాయలు, చామంతి, కనకాంబరం) 50 మైక్రాన్ల మల్చింగ్ షీట్లను ఉపయోగిస్తారు. 12-15 నెలల వ్యవధి కలిగిన పంటల సాగుకు (గులాబీ, బొప్పాయి, మామిడి, సీతాఫలం) 100 మైక్రాన్ల మల్చింగ్ షీట్లను వాడటం మేలు. గాలి భూమిలో చొరబడనీయకుండా నేలలోని ఉష్ణోగ్రత బయటి వాతావరణంలో కలవనీయకుండా ఈ మల్చింగ్ షీట్లు ఉపయోగపడుతాయి.

మల్చింగ్ సాగు విధానం

విత్తనాలు విత్తుటకు ముందు మల్చింగ్ మొక్కమొక్కకు, వరుసకు గల దూరాన్ని బట్టి షీటుపై రంధ్రాలు చేయాలి. ప్రస్తుతం రంధ్రాలు చేసిన షీట్లు కూడా లభ్యమవుతున్నాయి. మొక్కల చుట్టూ అనుకూలంగా మల్చింగ్ షీటును మందంగా తగిన సైజులో కత్తిరించుకోవాలి. ఆ తర్వాత షీటుపై మొక్కల దగ్గర చిన్న రంధ్రాలు చేసి వాటిని తొడిగి యాంకరింగ్ చేయాలి. మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూరా 5 సెం.మీ. నుంచి 10 సెం.మీ. లోతు గాడి చేయాలి. ఈ షీటును ప్రతి వరుసలో లేదా మొక్క దగ్గర మరీ వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను యాంకరింగ్ అని అంటారు. మిరప, టమాటా, క్యాప్సికమ్, కర్బూజ, పుచ్చ వంటి పంటలు వేసే వారు ముందుగా 10 సెంటీమీటర్ల వెడల్పు, 15-20 సెంటీమీటర్ల ఎత్తులో బోదెలు తయారు చేసుకోవాలి. వాటి మధ్య డ్రిప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలి. డ్రిప్‌లైన్ పైన 25 లేదా 50 మైక్రాన్ల మల్చింగ్ షీట్లను పరిచి బోదెల కింది భాగంలో మట్టితో కప్పాలి. డ్రిప్‌లైన్‌కు ఇరు వైపులా తీవీ సెంటీమీటర్ల దూరంలో రెండు అంగుళాల వ్యాసంతో రంధ్రాలు చేయాలి. వాటి మధ్య విత్తనాలు విత్తుకోవడం లేదా మొక్కలు నాటాలి. విత్తనం మొలకెత్తే వరకూ లేదా నారు మొక్కలు నిలదొక్కుకునే వరకూ ప్రతి రోజూ ఎక్కువ మొత్తంలో నీటిని అందించాలి. ఆ తర్వాత సీజన్‌ను బట్టి ప్రతి రోజూ అవసరమైన మేరకు డ్రిప్ ద్వారా నీటిని వదలాలి. ఎరువుల్ని కూడా డ్రిప్ ద్వారా అందించవచ్చు. వేసే పంట, మొక్కల మధ్య దూరాన్ని బట్టి ఎకరానికి మల్చింగ్ షీట్ల కొనుగోలుకు రూ. 10-15 వేలు ఖర్చవుతాయి. కాగా ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై మల్చింగ్ షీట్స్‌ను అందిస్తుంది.

కలుపు సమస్య చాలా తక్కువ



మల్చింగ్ షీట్‌ను ఉపయోగించి రెండోసారి కూడా విత్తనాలు నాటుకోవచ్చు. కాయగూరలు సాగుచేసినా మంచి దిగుబడి వస్తుంది. కలుపు సమస్య చాలా తక్కువగా ఉంటుంది. పంటకాలం తర్వాత మల్చింగ్ షీటును పొలం నుంచి తీసివేసి పనులు చేసుకోవాలి. 7.5 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు ఒక పంట కాలానికి, 50-200 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు 3 సంవత్సరాల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

- శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి

50 శాతం సబ్సిడీ..



రైతులు సాగు చేసుకునే ఉద్యావన పంటలన్నింటికి 50 శాతం సబ్సిడీపై షీట్స్ ఇవ్వడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపిచాం. ఈ పద్ధతిలో సాగు చేసుకుంటే అధిక దిగుబడితో పాటు కలుపు సమస్య ఉండదు. నీరు ఆదా అవుతుంది. భూమిలి కరిగిపోయో గుణం ఉన్న ఈ ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను తీసుకునేటప్పుడు ఐఎస్ఐ మార్కు ఉన్న వాటినే కొనాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవాలి.

- శైలజ, ఉద్యానవన శాఖ అధికారి

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన కారు.. మహిళ మృతి

● ముగ్గురికి గాయాలు



అమృత మృతదేహం

హత్నూర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని దేవులపల్లి గ్రామ శివారులో దౌల్తాబాద్-హత్నూర రోడ్డుపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామానికి చెందిన అమృత(45) తన కుమారుడు కృపాకర్, కోడలు అనూష, రెండేళ్ల మనవరాలితో కలిసి బైక్‌పై దౌల్తాబాద్ వైపు వస్తున్నారు. దేవులపల్లి శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు బలంగా వీరి బైక్‌ను ఢీ కొట్టడంతో అమృత అక్కడికక్కడే మృతి చెందింది. కృపాకర్, అనూష, రెండేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

కారు, బస్సు ఢీకొని యువకుడు..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



శ్రావణ్ కుమార్(ఫైల్)

శివ్వంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ తూప్రాన్ జాతీయ రహదారి శభాష్‌పల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ (19) స్నేహితుడి కారు తీసుకొని తూప్రాన్‌లో షాపింగ్ చేసి వెళ్లి తిరిగి శివ్వంపేట మీదుగా నల్లవల్లికి వస్తున్నాడు. అదే సమయంలో నర్సాపూర్ వైపు నుంచి తూప్రాన్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి శభాష్ పల్లి సమీపంలో కారును ఢీకొనడంతో శ్రావణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో తూప్రాన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

కుక్కను తప్పించబోయి చెట్టును ఢీకొట్టి..



ఎల్లం (ఫైల్)

చిన్నశంకరంపేట ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : బైకు చెట్టును ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని కొరివిపల్లి గ్రామ శివారు మెదక్ చేగుంట రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ నారాయణ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మడూర్ గ్రామానికి చెందిన సంధిగళ్ల ఎల్లం (48) వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై మెదక్ వెళ్తున్నాడు. అడ్డుగా వచ్చిన కుక్క తప్పించేక్రమంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జ్యోతి, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య



కళవ్వ మృతదేహం

కుకునూరుపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కుకునూరుపల్లి ఎస్ఐ తెలిపిన కథనం ప్రకారం.. కొనాయిపల్లి గ్రామానికి చెందిన దున్నపోతుల కళవ్వ(38)కు 12 ఏళ్ల క్రితం వివాహం కాగా, భర్తతో మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకొని తల్లిగారి గ్రామమైన కొనాయిపల్లిలో తన పదేళ్ల కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తున్నది. ఒంటరి తనం, ఆర్థిక సమస్యల తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి కావడంలేదని యువకుడు..



బాలరాజ్ (ఫైల్)

మద్దూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఆదివారం గ్రామస్థులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోడపట్ల అంజమ్మ, సిద్ధయ్య దంపతుల పెద్ద కుమారుడు బాల్‌రాజ్(29) తన చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో కుటుంబానికి పెద్దదిక్కుగా మారాడు. ఐదేళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరకపోవడంతో తీవ్ర డిప్రెషన్ గురవుతున్నాడు. ఇటీవల తన తమ్ముడు రాజేందర్‌కు పెళ్లి కుదిరినప్పటి నుంచి బాల్‌రాజు తీవ్ర ముభావంగా ఉంటూ ఇంటికి రాకుండా రాత్రిళ్లు వ్యవసాయ బావి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 23న తమ్ముడి వివాహం జరగడంతో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి వచ్చిందని లోలోనే కుంగిపోయాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి పెద్దనాన్న కుమారుడికి సమాచారం చేరవేశాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడివెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న బాలరాజ్‌ను చేర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్‌కు మంటలు

● డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం



నర్సాపూర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉనాయి. బ్రాహ్మణపల్లి పరిధిలోని తండావాసి రమేష్‌నాయక్ తన ట్రాక్టర్‌లో గడ్డిని లోడ్ చేసుకుని వెళ్తుండగా విద్యుత్ వైర్లు గడ్డికి తగిలి మంటలు అంటుకున్నాయి. దీన్ని గమనించిన డ్రైవర్ భయపడకుండా ట్రాక్టర్‌ను జనావాసాలకు దూరంగా తీసుకెళ్లి ట్రాలీని హైడ్రాలిక్ ద్వారా పైకి లేపి తగలబడుతున్న గడ్డిని కింద పడేయడంతో పెను ప్రమాదం తప్పింది.

'కేతకీ'లో ప్రత్యేక పూజల సందడి



స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

ఝరాసంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కేతకి సంగమేశ్వర ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా అమృతగుండంలో స్నానాలుచేసి దైవదర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. పూజల్లో పాల్గొన్న జిల్లా అదనపు జడ్జి కృష్ణఅర్జున్‌కు కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప తీర్థ ప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు.

'కరాటే పంచ్'లో తూప్రాన్ విద్యార్థులు



రికార్డు సాధించిన తూప్రాన్ విద్యార్థులు

తూప్రాన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన హై రెంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో తూప్రాన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు జ్ఞానీ షోటోకాన్ కరాటే మాస్టర్ కాశీనాథ్ తెలిపారు. 10 నిముషాల్లో 200 నుంచి 2 లక్షల పంచ్‌ల పోటీలు వరల్డ్ రికార్డు కోసం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 1200 మంది పాల్గొన్న ఈ పోటీల్లో తూప్రాన్ మండలానికి చెందిన 30 మంది విద్యార్థులు భాగస్వాములైనట్లు తెలిపారు. 2000 పంచ్‌ల పోటీల్లో 25 మంది తూప్రాన్ విద్యార్థులు రికార్డు సాధించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని



కల్పన

మునిపల్లి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరాలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింకాన గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో బీబీఏ రెండో సంవత్సరం చదువుతున్న బి.కల్పన సత్తా చాటిందన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఆదిలాబాద్‌లోని మందమర్రి సింగరేణి స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కల్పనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మాధవి, అధ్యాపకులు అభినందించారు.

40 తులాల బంగారు ఆభరణాలు చోరీ

● ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్

కంది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కంది మండల కేంద్రంలోని పాత కందిలో శనివారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా ఆకువీడు గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నందవరం కృష్ణమాచారి ఐఐటీ హైదరాబాదులో సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు నెలలగా పాత కందిలో ఓ ఇండిపెండెంట్ ఇల్లును కిరాయికి తీసుకొని భార్య హైమావతి, కుమారుడు, కోడలు, మనమరాలితో కలిసి ఉంటున్నారు. కుమారుడి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబంతో కలిసి తన సొంతూరు ఆకువీడుకు శుక్రవారం వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు శనివారం రాత్రి అతని ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో భద్రపరిచిన బంగారు గాజులు, చైన్లు, ఉంగరాలు, బ్రాస్లెట్, చెవి కమ్మలు తదితరాలు మొత్తం 40 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయాన్నే పక్కింటి వారు కృష్ణమాచారి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి వారికి ఫోన్ చేసి సమాచారం అందించారు. బీరంగూడలో నివాసం ఉంటున్న ఆయన కుమార్తెలు, బంధువులు వెంటనే వచ్చి చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించి సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవీందర్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై మురుగు పరుగు

తూప్రాన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామంలోని 8వ వార్డులో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. కాలువల నిర్వహణ చేపట్టకపోవడంతో డ్రైనేజీలు నిండి పోయి మ్యాన్‌హోల్స్ నుంచి నీరు బయటకు ప్రవహిస్తుంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.



'కథలు చెప్పడం ఒక కళ'



ఎన్నవెల్లి రాజమౌళికి సత్కారం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కథలు చెప్పి, నీతిని పంచడం మూలంగా మంచి ఆలోచనలకు స్థానం లభిస్తుందని, కథలు చెప్పడం ఒక కళ అని కథాశిల్పి ఐతా చంద్రయ్య అన్నారు. ఆదివారం జాతీయ కథల దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో జరిగిన సమావేశంలో 320 బడులలో, కార్యశాలలు, సమావేశాలలో కథలు చెప్పి, విద్యార్థులను మంచివైపు నడిచేలా బాటలు వేస్తున్న కథల తాతయ్య ఎన్నవెల్లి రాజమౌళికి సత్కారం చేశారు. ఈ సందర్భంగా బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ బాలలకు కథలు చేరువయ్యేలా వేసవి సెలవులలో బాలలకు కథలు వినిపించాలన్నారు. సన్మాన గ్రహిత ఎన్నవెల్లి రాజమౌళి మాట్లాడుతూ పిల్లల ప్రపంచంలో కథలు చెప్పడం సంతోషమనిపిస్తుందన్నారు. బాలల వికాసానికి కథలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కవులు సింగీతం నరసింహరావు, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, ఉండ్రాళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలకు కొత్త రూపు

● సకల వసతులతో కళకళ
● నేడు ప్రారంభించనున్న మంత్రులు
● విద్యార్థులకు నాణ్యమైన బోధన



కళాశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన వసతి గృహ భవనం

హత్నూర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల కొత్త కళ సంతరించుకుంది. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 1992లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలోనే ఏకైక బాలుర గురుకుల కళాశాలను ఇక్కడ నెలకొల్పారు. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల, వసతి గృహం, సిబ్బంది నివాస గృహ భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పించారు. ఈ కాలేజీలో బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ కోర్సులను అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నిర్వహిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలోని అన్నీ జిల్లాలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటీలలో అవకాశాలు సాధించి అక్కడ ఉన్నత విద్యను అభ్యసించేలా అధ్యాపకులు తీర్చిదిద్దుతున్నారు. అయితే పురాతన భవనాలు కావడంతో విద్యార్థుల వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోవడం, పరిసరాల్లోని రోడ్లు బురదమయంగా మారి విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యలను అధ్యాపకులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోగా.. వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. ఐదు నెలల వ్యవధిలోనే పనులు తుది దశకు చేరుకున్నాయి.

నేడే ప్రారంభోత్సవం

మండల కేంద్రమైన హత్నూర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలలో పూర్తయిన నిర్మాణాలను సోమవారం రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిల హాజరై ప్రారంభించనున్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

ఈ కళాశాలలో వసతుల కల్పన కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి అలుగు వర్షినిలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు. అమాత్యుల ఆదేశానుసారం విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో తమ అధ్యాపక బృందంతో పాటు తాము కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



నూతనంగా వేసిన సీసీ రోడ్డు

ఎన్ని నిధులతో ఏయే పనులంటే..

- నాబార్డు ఫండ్స్ నిధుల నుంచి రూ.2 కోట్ల వ్యయంతో నాలుగు గదుల డార్మెటరీ భవనం నిర్మాణం.
- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.63లక్షల వ్యయంతో కళాశాల పరిసర మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చారు.
- ప్రధానమంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజన (పీఎంకేకేవై) కింద రూ.19.5లక్షలతో మరమ్మతులు, నీటి సరఫరా, విద్యుద్దీకరణ పనులు కొనసాగుతున్నాయి.
- సీఎస్ఆర్ నిధుల కింద హెటిరో సంస్థ 40కంప్యూటర్లు అందించి, కంప్యూటర్ ల్యాబ్ అభివృద్ధికి తోడ్పడుతోంది.

న్యూస్ బాక్స్

30న ఖేడ్‌లో సామాజిక సమరత రథయాత్ర

నారాయణఖేడ్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామాజిక సమరత రథయాత్ర 30న నారాయణఖేడ్‌కు చేరుకోనున్నదని కార్యక్రమ స్వాగత సమితి వారు ఆదివారం తెలిపారు. హిందూ సమాజంలోని అన్ని కులాలు, వర్గాలు, జాతులు, వర్గాలు, భాషలు, ప్రాంతాల వారు కలిసిమెలసి ఆనందంగా జీవించడమే సమరసత లక్ష్యం అన్నారు. 30న సాయంత్రం పట్టణంలోని అప్పారావుషెట్కార్ విగ్రహం సమీపంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

మనూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని మండల పరిధిలోని రాయిపల్లి పాఠశాల హెచ్‌ఎం ఎం.నీలమ్మ కోరారు. ఆదివారం గ్రామంలో బడిబాటలో భాగంగా గడపగడపకు కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరణ

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న బసవేశ్వర జయంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని కారముంగి శిఖార్‌ఖానా, కరస్‌గుత్తి గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు సాగర్‌షెట్కార్ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు.

'మన్‌కీబాత్'లో నాయకులు

నర్సాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేర్వేరుగా పాల్గొన్నారు. మురళీధర్‌యాదవ్ తన నివాసంలో పలువురు నాయకులతో కలిసి ప్రధాని మన్‌కీబాత్‌లో పాల్గొనగా.. జిల్లా అధ్యక్షుడు శివాలయం వీధిలోని ఓ ఇంట్లో పాల్గొన్నారు. అలాగే శివ్వంపేటలో కూడా బీజేపీ నాయకులు మన్‌కీబాత్ వీక్షించారు.

సనాతన ధర్మంపై ఉచిత శిబిరం

మాసాయిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలోని రుక్మిణీ పాండురంగస్వామి విఠలేశ్వర ఆలయంలో 28 నుంచి మే 2 వరకు 'సనాతన ధర్మం- భారతీయ విలువలతో సంప్రదాయం' అనే అంశంపై విద్యార్థులకు ఉచిత విద్యా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి హరిరంజన్‌శర్మ తెలిపారు. సనాతన ధర్మం, భారతీయ విలువల గురించి నిష్ణాతులైన మేధావులు వివరిస్తారని చెప్పారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇళ్ల మంజూరుపై హర్షం

శివ్వంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మండలానికి 42 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా శబాష్ పల్లి గ్రామానికి 40 ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా.. మండలానికి 422 ఇండ్లను కేటాయించిందన్నారు.

బగళాముఖి ఆలయంలో మహామంత్రహవనం

శివ్వంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శక్తిపీఠం బగళాముఖి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు మహా మంత్రాహవనం ఘనంగా నిర్వహించారు.

సీసీ కెమెరాలతో భద్రత

వెల్దుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న సామగ్రి అపహరణకు గురికాకుండా ఉండేందుకే ముందస్తుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

మహిళ అదృశ్యం

శివ్వంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మహిళ అదృశ్యమైన సంఘటన చండీ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని చండీ గ్రామానికి చెందిన సంధిగాని కళ్యాణి(26)కి శంకరంపేట్ మండలం ధర్పాల్లి చెందిన కాడి గాని బాబుతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో కళ్యాణి చండీలో తల్లి గారి ఇంటి వద్ద ఉంటుంది. ఈనెల 26న కళ్యాణి ఇంట్లో ఉండగా తండ్రి పొలం దగ్గరికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ భవనం పూర్తయ్యేదెన్నడో?

- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల వేడుకోలు


ముస్లాపూర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

అల్లాదుర్గం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యంతో అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పదేళ్లుగా అలంకార ప్రాయంగానే ఉన్నది. గ్రామంలో పక్కా అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే బాబుమోహన్ భవన నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిన అధికారులు ఉన్నట్టుండి పనులు అర్ధాంతరంగా నిలిపేశారు. పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఈ భవనాన్ని పశువుల పాకగాను, కాలనీవాసుల పాత సామగ్రి స్టోరేజీ కోసం వినియోగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ భవన నిర్మాణం పనులు 75 శాతం వరకు జరిగాయని, కేవలం సైడు గోడలు, తలుపులు, ఫ్లోరింగ్ వేస్తే వినియోగంలోకి వస్తుంది. ఇద్దరు ఎమ్మెల్యేలు మారినా అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయకపోవడంలో ఆంతర్యమేంటోనని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు, పాలకులు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంకు


శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకు

నారాయణఖేడ్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని 8వ వార్డులో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ట్యాంకును తొలగించి, కొత్త ట్యాంకును నిర్మించాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!


కోహీర్‌లో ప్రధాన తారు రోడ్డుపై ఉన్న పెద్ద గుంతలో నిలిచిన మురుగునీరు

కోహీర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ నుంచి తాండూర్‌కు వెళ్లే ప్రధాన తారు రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోహీర్ మున్సిపల్ పట్టణంలోని బసంత్ పూర్ కాలనీ సమీపంలో గల తారు రోడ్డుపై మురుగునీరు చేరడంతో.. తారు లేచిపోయి పెద్ద గుంత ఏర్పడింది. చాలామంది ద్విచక్ర వాహనదారులు రాత్రివేళల్లో ఆ గుంతలో పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారుల తప్పిదంతోనే బీమాక్ కాలనీలో సమస్యలు


అక్రమ నిర్మాణం ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అధికారుల తప్పిదంతోనే బీహెచ్‌ఈఎల్ కార్మికుల గృహ సముదాయాల్లో సమస్యలు నెలకొన్నాయని బీమాక్ కాలనీ సొసైటీ సభ్యులు ఆరోపించారు. వారంరోజులుగా కాలనీలో జరిగిన వివాదాలు, సభ్యులు తీసుకున్న చర్యల గురించి ఆదివారం సొసైటీ సభ్యులు కాలనీవాసులకు వివరించారు. హెచ్‌ఎండీఏ అనుమతితో చేసిన లే అవుట్‌లో 1,251 ఇళ్లను ఎస్ఎస్‌పీడీఎల్ అనే నిర్మాణ సంస్థ నిర్మించిందన్నారు. సదరు నిర్మాణ సంస్థ లే అవుట్‌లోని 12 వందల గజాల స్థలాన్ని ఓ ప్రవేటు వ్యక్తికి విక్రయించిందన్నారు. సదరు వ్యక్తి మున్సిపల్ అనుమతితో కాలనీలో బహుళ అంతస్తుల భవనాన్ని ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. కాలనీకి గేటెడ్ కమ్యూనిటీగా హెచ్‌ఎండీఏ లే అవుట్ ధ్రువీకరించిన నేపథ్యంలో ఇక్కడ ప్రవేటు వ్యక్తులు బహుళ అంతస్తులు నిర్మిస్తే వాటికి మౌలిక వసతులు ఎవరు కల్పించాలన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోక పోతే ఎస్‌టీపీ నిర్వహణ, ఇతర మౌలిక వసతులను మున్సిపాలిటీయే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సొసైటీ అధ్యక్షుడు శివనారాయణ, ఉపాధ్యక్షుడు మాధవరావు, ప్రధాన కార్యదర్శి సంజీవరావు, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, ఏడుకొండలు, గోవర్ధన్, రవీందర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్


మిషన్ భగీరథ లైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

పాపన్నపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ లైన్ పగిలిపోవడంతో తాగునీరు అంతా వృథాగాపోతున్నది. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామంలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఎల్లమ్మ గుడికి కొద్దిదూరంలో పైపులైన్ పగిలింది. ఈ లైన్‌ను అరికెల గ్రామంతో పాటు పలు తండాలకు నీటి సరఫరా కోసం వేసినట్లు సమాచారం. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కాలనీవాసులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సాయినగర్ పార్క్‌లో వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వాకింగ్ ట్రాక్ దారి పొడవునా పిచ్చిమొక్కలు, గడ్డి పెరగడంతో పాములు, క్రిమికీటకాలు వస్తున్నందున అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, అశోక్, సుదర్శన్, శ్రీనివాస్, పీరయ్య, ప్రభాకర్, సాయిలు, రామ్మోహన్, వెంకట్‌గౌడ్, కరాటే మాస్టర్ నవీన్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మనోహరాబాద్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మనోహరాబాద్/మునిపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 పదో తరగతి విద్యార్థులు, అలాగే మండల కేంద్రమైన మునిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2004-2005లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆనాడు చదువు చెప్పిన గురువులను సత్కరించారు.


మునిపల్లి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఫైవ్‌మెన్ కమిటీతో మత్స్యకారులకు న్యాయం

- కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్


సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఫైవ్ మెన్ కమిటీతో మత్స్యకారులకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. ముదిరాజ్‌ల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ముఖ్య నాయకులు ఎమ్మెల్యే వాకిట శ్రీహరి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ తదితరులు సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డితో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా మత్స్యకారులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, వృత్తిపరంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఫైవ్ మెన్ కమిటీ నివేదిక తమకు అనుకూలంగా వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేయించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశం పొందేందుకు పరీక్ష నిర్వహించారు. 6వ తరగతిలో 1,295 మందికి 1,073 మంది హాజరుకాగా, 222 మంది గైర్హాజరయ్యారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 802 మందికి 625 మంది హాజరుకాగా 177 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన


మెదక్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ మెదక్‌లో ఆదివారం రాత్రి డివిజన్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

గ్రామగ్రామాన పార్టీ బలోపేతమే లక్ష్యం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి


బీఆర్ఎస్‌లో చేరిన బొంతపల్లి కాంగ్రెస్, ఎన్ఎంఆర్ యువసేన నాయకులు

గుమ్మడిదల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామగ్రామాన పార్టీ బలోపేతమే లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గోవర్ధన్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొంతపల్లి నుంచి యువకులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం పార్టీ బలానికి తోడ్పడుతుందన్నారు. ప్రజాసేవే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామంలో పార్టీ ప్రభావాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సుంకరి శంకర్‌ముదిరాజ్, ఉప్పరి ఎల్లం, సుంకరి ఆంజనేయులు, మొగుళ్ళ బీరప్ప, తలారి శేఖర్, తలారి రాజు, సుంకరి సురేష్, బాలరాజు, సాయిబాబా, మహేష్, చంద్రయ్య, నిరుడి నరసింహ ఉన్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన కల్వకూరి మల్లేష్ కూడా బీఆర్ఎస్ గూటికి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, ముద్దంగుల గోపాల్, నాగేష్‌గౌడ్, వినోద్‌గౌడ్, రమేష్, చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 332 మంది హాజరు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఇంగ్లిష్ మీడియం 6వ నుంచి పదో తరగతి ప్రవేశం కోసం నిర్వహించి పరీక్షకు 332 మంది విద్యార్థులు హాజరైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారి తెలిపారు. 6వ ఆరో తరగతికి సంబంధించి 200 మంది విద్యార్థులు హాజరుకాగా.. 7వ తరగతి 54 మంది, 8వ తరగతికి 42 మంది, 9వ తరగతికి 30 మంది, పదో తరగతికి ఆరుగురు హాజరైనట్లు తెలిపారు.

నేడు హజ్ యాత్రికుల శిక్షణ శిబిరం

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర హజ్ యాత్రకు మెదక్ జిల్లా నుంచి ఎన్నికైన యాత్రికులకు నేడు మెదక్ పట్టణంలోని న్యూ భారత్ ఫంక్షన్‌హాల్ పెద్దబజార్‌లో ఉదయం 10.30 గంటలకు శిక్షణ శిబిరం, వ్యాక్సినేషన్ క్యాంపు నిర్వహిస్తున్నామని హజ్ సొసైటీ జిల్లా బాధ్యుడు ఎండీ.ఏజాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ స్క్రీనింగ్‌తో పాటు హజ్ యాత్రికులకు పోలియో చుక్కలు, టీకాలు వేస్తారన్నారు.

'సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి'

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పెద్దశంకరంపేటలోని ఎస్సీ కాలనీలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూఢనమ్మకాలను ఎవరూ నమ్మకూడదని తెలిపారు.

సభకు తరలిన నాయకులు

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆయా మండలాల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, మళ్లీ అధికారంలోకి తామే వస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్


సభకు తరలివెళ్లే ముందు సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


జహీరాబాద్ : రజతోత్సవ సభకు వెళ్తున్న సందర్భంగా పట్టణంలో పార్టీ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు


హత్నూర: దౌల్తాబాద్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి


పెద్దశంకరంపేట నుంచి సభకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, పాల్గొన్న నాయకులు